# కాలం నేర్పిన పాఠం

అయిదు గంటలు కొడుతూవుండగా శాంతి యింటికి వస్తుంటె ఎడం కన్ను అదిరింది.

"ఏమిటి కన్ను యిల్లా అదురుతోంది. ఒక్కసారి డాక్టరుకు చూపించు కోవాలి" అని అనుకుంటూ యింటిలో అడుగుపెట్టింది. యింటిమీద వాలిన కాకి "కావు కావు" మని అరచింది. "ఛీప్"మని కాకిని కొట్టి, అక్కడ ఒక్కక్షణం నిలబడ్డది.

కన్ను అదిరితే అదృష్టమంటారు. కాని అరిస్తే బందుగులు వస్తారంటారు. నాయింటికి వచ్చే బంధువు లెవరు! నాకింకా క్రొత్తగావచ్చే అదృష్టమేముంది. ఇంకో రెండేళ్ళకి ప్రొఫెసరు రిటైరు అయితే, ఆవిడ పోస్టులో నన్ను వేస్తారు. దానికి యిప్పటినుంచి కన్ను అదరడం దేనికి? రెండు సంవత్సరాల తరువాత ఏం జరుగనుందో ఎవరికి తెలుసు?"

తలుపు తాళంతీసి అడుగులోపల పెట్టేసరికి కిటికీలోంచి పోస్టుమన్ లోపలికి పడేసిన ఉత్తరాలు కనిపించాయి. రెండు ఇంగ్లీషు పత్రికలు, ఒక కవరు, కవరుమీద దస్తూరి చూడగానే ఒక్కసారి చేతులు వణికాయి. ఫ్లాస్కులో కాఫీ పోసుకుని త్రాగి కుర్చీలో కూర్చుని ఉత్తరం చదవటం మొదలు పెట్టింది.

"డియర్ శాంత,

ఇన్ని సంవత్సరాలు తరువాత నా దగ్గరనుంచి ఉత్తరం రావటం నీకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. బహుశః బాధలన్ని ఒక్కసారి మనసులో మరలి కష్టాల్ని కలిగించవచ్చు. ముందు కోపాన్ని తెప్పించవచ్చు. కాని యిన్ని సంవత్సరాలు గడచిన తరువాత, ఆ కోపానికి మనసులో నిలవదని తెలుస్తూనే యీవుత్తరం రాయడం మొదలుపెట్టాను.

ఈ అయిదు సంవత్సరాలలో తెలిసినవాడినిగ వున్నా, నువ్వు సాధించిన లక్ష్యాలని గురించి మిత్రులు ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే వున్నాను. నిన్నొకసారి కలుసుకోవాలని, నిన్ను అభినందించాలని మనసులో సంకల్పం కలిగింది. కాని ఎప్పటికప్పుడే ఏదో ఒకలా వాయిదా పడ్డది. రేపు వుదయం వస్తున్నాను. నిన్ను చూడటానికి సాయంకాలం ఏడు గంటలకు వస్తాను. నీకు అభ్యంతరం వుండదనుకుంటాను. ఇబ్బంది ఏమైనా వుంటే నాకు ఫోన్ చేసి

చెపితే, నేను కలుసుకోవడానికి ప్రయత్నించను. నేను దాసప్రకాశ్ హోటల్‌లో బసచేస్తాను.

నీ

రఘు

"నాతో ఈయనకేం పని? నన్ను చూడటానికేం రానక్కర్లేదు. రావద్దని ఫోన్ చేసి చెప్పేస్తాను."

ఇంటి తలుపు దగ్గరగా వేసి ప్రక్కయింట్లోకి వెళ్ళి "పిన్నిగారూ" అని పిలిచింది. పిన్నిగారు పలికింది -

"టెలిఫోన్ చెయ్యాలి."

"టెలిఫోన్ ప్రొద్దుటనుంచి పనిచెయ్యటంలేదట. అబ్బాయి రిపోర్టు కూడా యిచ్చాడు" అని పిన్నిగారు పలికింది.

ఇంటికి రాగానే వుత్తరం మళ్ళీ చదివింది. ఎందుకు వస్తున్నట్టు? నన్ను మళ్ళీ ఆ నరకంలోకి లాక్కునివెళ్ళటానికా? నేను చచ్చినా మళ్ళీ అక్కడికి వెళ్ళను. ఆయన వస్తే అసలు నేను మాట్లాడను. ఇప్పుడే సినిమాకు వెళ్ళిపోతాను. అయినా నేను ఎందుకు భయపడాలి? నిర్భయంగా చెప్పేస్తాను "మన ఇద్దరిమధ్య సంబంధం ఏనాడో తెగిపోయింది. ఈనాడు నామీద మీకేమి అధికారం లేదు" అని.

అసలు ఎందుకు వస్తున్నట్టు! నన్ను తీసుకువెళ్లడంకోసం వస్తున్నట్టుగా ఎక్కడా లేదే? ఎందుకుంటుంది? పెళ్ళామంటే ప్రేమ ఏకోశానన్నా వుంటేగా! ఎంతసేపూ ఆ పల్లెటూరు, సొంత వ్యవసాయం. ఎంత చదువుకొని వుంటే మాత్రం ఏం లాభం? ఎమ్.ఎస్‌సి. పాసై యిలా కాలం వృధా చేస్తున్నవాళ్ళు ఎవరైనా వుంటారా? మిగతావాళ్ళంతా ఎటువంటి హైపొజిషన్లలోకి వెళ్ళలేదు? మనం మాత్రం ఆ పల్లెటూరివాళ్ళతో కలసి స్నేహాలూ, సొంత వ్యవసాయం!

హేమ మొగుడు అమెరికా వెళ్ళాడు. సరసు మొగుడు కెనడా వెళ్ళాడు. మా ఆయన మాత్రం ఉద్యోగం సద్యోగం లేకుండా బలాదూర్ తిరుగుతున్నాడంటే నాకు మాత్రం ఏం గౌరవం. ఐనా ఆ మనిషి మీద కోపం తెచ్చుకుని ఏం లాభం? ఈ మగవాళ్ళంతా యింతే! మనసిచ్చేదాకా మనమాట వింటారు. ఆ మూడు ముళ్ళూ పడ్డతర్వాత మాత్రం పైచేయి వాళ్ళదే. అప్పట్నుంచీ, మనం వాళ్ల యిష్టానిష్టాలతో నడుచుకోవాలి. అందరు మొగవాళ్లు యిలాంటి వాళ్లే అయితే ప్రపంచం యిలాగే అంతమయ్యేది.

హేమ, సరసు వాళ్ల మొగుళ్లు వాళ్లని ఎంత ప్రేమగా చూసుకుంటారు!

కాలు కింద పెట్టనివ్వరు. పెళ్లాం మాట అంటే ఎంత లక్ష్యం! ఎంత ప్రేమ! ఒకరిని అనుకుని ఏం లాభం? ఎవరి అదృష్టం వారిది.

"అమ్మగారూ, హోటల్‌కి వెళ్ళిరానా?" అని పనిచేసేది అడిగింది.

"వెళ్లు. యిదిగో... యిద్దరికి భోజనాలు తీసుకురా."

"యిద్దరికా?"

"అవును ఇవ్వాళ చుట్టాలు వస్తున్నారు."

స్నానం చేసి, నూలు చీర తెల్లటిది కట్టుకుని తెల్ల జాకెట్టు వేసుకుంది. పౌడరు వేసుకుంటూ ఒకసారి అద్దంలో చూసుకుంది. తను అందగత్తె అని అందరూ అంటారు. కాని ఏం లాభం? సుఖం, శాంతి యివ్వలేని అందం ఉండి ఏం ప్రయోజనం?

పెళ్ళికాక పూర్వం రఘు ఏమనేవాడు? "నాకు కవిత్వం చెప్పటం వస్తే నీమీద రామాయణమంత గ్రంథం వ్రాసేవాడిని. మా మామిడితోటలో నీవు నిలబడితే, రవివర్మ చిత్రించిన శకుంతల, అనసూయ గుర్తుకు వస్తాయి. నువ్వు మా మేడమీద నిలబడి చూస్తూ వుంటే నలుడికోసం నిరీక్షించే దమయంతి గుర్తుకు వస్తుంది."

"మీరు చెప్పినవాళ్ళెవరూ జీవితంలో సుఖపడలేదు" అని తను అన్నది.

"వాళ్ళు కష్టాలు ఎదుర్కొన్నారు. కాబట్టే చరిత్రలో శాశ్వతంగా నిలబడి పోయారు."

"చరిత్రలో శాశ్వతంగా నిలబడి పోవాలని కోరటం లేదు. బ్రతికిన నాలుగు రోజులూ అన్ని సుఖాలూ అనుభవించాలి."

"సుఖమంటే ఏమిటి?"

"సుఖమంటే సుఖమే."

"అదికాదు. సుఖమంటే బాధలు లేకపోవడం, సుఖమంటే కోరినవాటిని పొందటం."

"నాకేం తెలియదు. నా జీవితం యిలా వెళ్ళిపోతే చాలు."

ఆనాడు తను రఘు మాటలు విని మోసపోయింది. అతనిని నమ్మి వివాహమాడింది. నా అన్నవాళ్ళు ఎవరూలేక పోబట్టి కదా యిలా చెయ్యగలిగాడు! అతని మాటల్ని బట్టి చూస్తే రఘు వాళ్ళ వూరు ఒక భూలోక స్వర్గం అనిపించేది. ఇంతకాలం తను పడ్డ అగచాట్లన్నీ ఈ వివాహంతో సమసిపోతాయని తను ఆశించింది.

కాని తలచినది ఒకటి. జరిగింది యింకొకటి. తనలాంటి దిక్కులేనిదాన్ని ఒక ఆగర్భశ్రీమంతుడు వివాహం చేసుకోవడానికి అంగీకరించాడంటే తను ఎంత సంబరపడ్డది. ఇప్పుడు అనుకుని ఏం లాభం? రఘు వాళ్ళది శుద్ధ పల్లెటూరు. మిగతా ప్రపంచమంతా యిరవై దాటి యిరవైఒకటవ శతాబ్దంలోకి ప్రయాణం చేస్తుంటే, యిక్కడ మాత్రం కాలం ముస్లిం యుగంలోనే ఆగిపోయింది. యుగయుగాల నాటి అలవాట్లు, అంతకంటె యుగయుగాలనాటి ఆచారాలు వీటితో తను ఒక్క వారం రోజుల్లోనే ఉక్కిరిబిక్కిరయ్యింది. రఘు వాళ్ళ అమ్మ సంగతి చెప్పనేఅక్కర్లేదు. తనను ఎంతో ఆప్యాయంగా చూసుకునేది. ఒక్క పని చెయ్యనిచ్చేది కాదు. పల్లెత్తి మాట కూడా అనేది కాదు. కాని ఆవిడ మనస్సులోని ఉద్దేశం మాత్రం దాగలేదు. శాంతిని చూసిన రోజునే పెదవి విరిచింది. నువ్వు మా యింటికి తగిన కోడలివి కాదని ఆవిడ చెప్పకుండానే ఆవిడ కళ్ళు చెప్పేవి. ఆవిడతోపాటే మిగతా బంధువులు అంతానూ.

బంగారందైతేనేం పంజరం పంజరమే. ఒక్క క్లబ్ లేదు. ఒక్క స్నేహితుడు లేడు. ఊరు మొత్తం మీద చదువువచ్చిన ఆడవాళ్ళని వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. అందులో ఇంగ్లీషు వచ్చిన వాళ్ళు అసలే లేరు.

ఇటువంటి వాతావరణంలో మనిషన్నవాడు ఎలా బతుకుతాడు? సిటీలో అంత ఫ్యాషనబుల్‌గా వుండే రఘు పల్లెటూరుకు రాగానే అంతకంటె పల్లెటూరు వాడు అయిపోయాడు. అతని దృష్టిలో ఈ మారుమూల పల్లె నిజంగా స్వర్గంలా ఉంది కాబోలు! వందలకొద్ది స్నేహితులు. వాళ్ళ సందడిలో, తనతో గడపటానికి క్షణంకూడా తీరికుండేది కాదు. తాము యిద్దరు ఏకాంతంగా ఉన్నప్పుడు కూడా ఊరిగొడవలు మాట్లాడేవాడు.

సిటీకి వెళ్ళినప్పుడు గంటకొక రకం సూటు తొడిగే రఘు యితనేనా అనిపించేది.

ఒకరోజున పగలంతా దిగులుగా గుబులుగా గడిచింది. ఏమీ తోచటం లేదు. సాయంకాలం అవగానే అలా షికారుకు వెళదామని రఘుని అడిగింది. “ఇది పల్లెటూరు. మనం యిద్దరం కలిసి రోడ్డుమీద వెడుతూ ఉంటే ఊళ్ళో వాళ్ళు నవ్వుతారు. పైగా యిటువంటి పనులు అమ్మకు నచ్చవు.”

“ఇక్కడ నాకేం తోచటం లేదు. ఈ ఊరు నుంచి వెళ్ళిపోదాం.”

“ఎక్కడికి వెడతాం చెప్పు. ఇక్కడ బోలెడన్ని వ్యవహారాలు, చిక్కులు ఉన్నాయి. ఇవన్నీ వదిలి వెడితే ఎవరు చూస్తారు?”

“నాకేం తెలియదు. ఈ వూళ్ళో ఒక్క నేను క్షణం కూడా వుండలేను.’

"అయితే ఏం చేద్దాం?"

"రేపే మద్రాసు వెళ్ళిపోదాం."

"తొందర పడొద్దు శాంతీ."

"నేను పడే బాధ మీకేం తెలుస్తుంది? నేను ఉన్నానో లేనో అనే విషయి మీకు అక్కరలేదు. నేనంటే మీకు ప్రేమ లేదు."

"శాంతీ! ఎంత కఠినమైన మాట అన్నావు?"

"నిజంగా నామీద ప్రేమ ఉంటే రేపు నాతోపాటు మద్రాసు వచ్చేసెయ్యండి."

"నీకు యిక్కడ పరిస్థితులు తెలియవు. ఇటునుంచి అడుగు కదిలిస్తే ఆస్తిపాస్తులు దక్కవు."

"మీకు నేను ముఖ్యమో, యీ పల్లెటూరు ముఖ్యమో తేల్చుకోండి. నేను మాత్రం రేపు మద్రాసు వెళ్ళిపోతున్నాను."

మర్నాడు ఉదయం తను లేవగానే సామాన్లు అన్నీ సర్దటం మొదలు పెట్టింది.

"అయితే నీ నిశ్చయం మార్చుకోలేదన్నమాట" అని రఘు అడిగాడు.

"లేదు."

"ఎందుకని?"

"నేను ఈ వూళ్ళో ఉండలేను."

"నేను రాను... రాలేను."

"మీరు రాకపోయినా సరే నేను వెళుతున్నాను."

"నాకంటే కూడా నీకు మద్రాసు ఎక్కువా?"

"ఈ పల్లెటూరు నాకంటే మీకు ఎక్కువైనప్పుడు నాక్కూడా మద్రాసే యిష్టం."

"ఐతే నీ యిష్టం. కాని పశ్చాత్తాప పడి లాభం ఉండదు."

"నన్ను బెదిరించనక్కరలేదు."

ఆనాడే తను మద్రాసు వచ్చేసింది. ఈనాటి వరకూ ఇక్కడే వుంది. మద్రాసు రాగానే రఘుకు ఉత్తరం రాసింది. సమాధానం కోసం ఎదురుచూసింది. ఏనాటికానాడు రఘు వస్తాడని ఎదురుచూసింది. రఘు రాలేదు. ఒకటవ తారీకున రెండు వందల రూపాయలకు మనీఆర్డరు వచ్చింది. అప్పటికి తనదగ్గర వున్న డబ్బుంతా పూర్తిగా ఖర్చైపోయింది. కానీ తను మాత్రం డబ్బు తీసుకోలేదు. నెల

రోజులు యిబ్బంది పడి ఉద్యోగం సంపాదించింది. ప్రతీ నెల ఒకటో తారీకున అతని దగ్గర్నుంచి మనీఆర్డరు వచ్చేది. తను తిప్పిపంపించేసేది. చివరికి తనకు డబ్బు పంపవలసిన అవసరం లేదని, తన బతుకు తను బతగ్గలనని ఉత్తరం కూడా రాసేసింది. డబ్బు రావటం ఆగిపోయింది. కష్టపడి ప్రైవేటుగా చదివి, ఎం.ఏ. ప్యాసయ్యింది. కాలేజీలో లెక్చరర్ అయ్యింది.

ఈనాడు తనకేం లోపం లేదు. కాని ఆ మాట మనస్సు మాత్రం ఒప్పుకోలేదు. తను కావాలని ఏరికోరిన మద్రాసులో ఉంటోంది. ఉద్యోగం చేసి స్వతంత్రంగా బతుకుతోంది. కాని ఎందుకనో జీవితం నిస్సారంగా కనిపిస్తోంది. పొద్దుటినుంచి సాయంకాలం వరకూ ఎవరి కోసం యీ చాకిరి? ఎవరు మెచ్చడానికి? ఎవరు సంతోషించడానికి?

"శాంతీ" ఎవరిదో కంఠం.

ఉలిక్కిపడి అటు చూసింది. రఘు! మనిషి ఎంత మారిపోయాడు!

"ఎల్లా వున్నావు శాంతీ?" రఘు అడిగాడు.

"బాగానే వున్నాను. మీరేమిటి ఇలా అయిపోయారు?"

"ఏం? మామూలుగానే వున్నానే."

"మామూలుగా ఏమున్నారు? మనిషి చిక్కి సగమైతే."

"ఏం లేదు."

"కూర్చోండి. నిల్చునే వున్నారు."

"థాంక్స్."

"మీ వూరునించి ఎప్పుడు బయల్దేరారు?"

"ఇప్పుడు ఆ వూర్లో వుండటం లేదు."

"ఎందుకని? అక్కడ వ్యవసాయం వదిలి ఒక్క అడుగు కదల్లేరుగా.'

"ఇప్పుడు అవేం లేవు."

"మీ అమ్మగారెలా వున్నారు?"

"పోయి నాలుగు సంవత్సరాలయ్యింది."

"నాకు తెలియపర్చలేదేం."

"చెప్పినా ఏం ప్రయోజనం? నన్ను పరామర్శించడానికైనా నువ్వు ఆ మారుమూల పల్లెకు రావుగా."

"ఎందుకు అల్లాఅంటారు? ఇప్పుడు ఇంటి దగ్గర ఎవరు?"

"ఎవరూ లేరు."

"ఎందుకని?"

"ఆ యిల్లు ఆడపిల్లల స్కూలుకు ఇచ్చేశాను."

"వ్యవసాయం."

"పొలం అమ్మేశాను."

"ఉన్న ఆస్తి అంతా ఒక్కసారి నాశనం చేశారా?"

"దానివల్ల సుఖం లేనప్పుడు నాశనం చెయ్యడమే మంచిది."

"నామీద కోపం చేతనేగా యివన్నీ చేసింది?"

"కోపం ఎవరిమీదా లేదు."

"ఇప్పుడేం చేస్తున్నారు?"

"బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నాను."

పనిమనిషి భోజనం తీసుకువచ్చింది.

"నేను వెడతాను భోజనం చెయ్యి" అంటూ రఘు లేచాడు.

"వెళ్ళడమేమిటి, మీక్కూడా భోజనం తెప్పించాను."

"ఈపూట ఆకలిగా లేదు."

"ఆకలి అదే వేస్తుంది. భోజనానికి లేవండి."

"కాదు శాంతీ."

"నాతో ఏం చెప్పొద్దు. భోజనానికి లేవండి" అంటూ వంటింట్లోకి తీసుకువెళ్ళింది. భోజనం చేస్తున్నంతసేపూ- 'మీరు ఏం తినడం లేదు. చూడండి మనిషి ఎల్లా అయిపోయారో. ఇల్లా అయితే ఆరోగ్యం ఏమన్నా నిలుస్తుందా' అని శాంతి అంటూనే వుంది. రఘు ఏం మాట్లాడలేదు.

భోజనం చేసిన తరువాత తమలపాకులకు సున్నం రాసి అతనికి యిచ్చింది. రఘు మనస్సులోంచి ఒక్క నిట్టూర్పు వచ్చింది.

"ఏమండీ" అని శాంతి పలకరించింది.

గడియారం తొమ్మిదిగంటలు కొట్టింది.

"వెడతాను" అంటూ రఘు లేచాడు.

"అప్పుడేనా! కూర్చోండి."

"లేదు శాంతీ! చాలా పొద్దుపోయింది."

శాంతి ఏదో చెబుదామని మాట్లాడలేకపోయింది.

"నేను వెడుతున్నాను శాంతీ! నిన్నొకసారి చూద్దామనుకున్నాను. చూశాను. నువ్వు సాధించిన లక్ష్యం చూసి గర్వపడ్డాను. కొద్దికాలంలోనే నువ్వు పొందిన ఔన్నత్యాన్ని చూసి గర్వపడ్డాను. కాని జీవితమంతా ఒంటరిగా గడపటం కష్టం. మనిషికి మనిషి సహాయం చాలా అవసరం. మంచో, చెడో నా జీవితానికి నేనొక పంథా ఏర్పరచుకున్నాను. నువ్వు కూడా నీ జీవితాన్ని సుఖమయం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నిన్ను నేను సుఖపెట్టలేకపోయినా నీ యెడల నాకుండే బాధ్యతని నేను ఎన్నడూ మర్చిపోలేదు. నా దగ్గర ఉన్న డబ్బులో సగానికి పైగా నీపేర బ్యాంకులో వేసాను. నీ ఖర్చులకు వాడుకోవచ్చు. సరదాకు కావాలనుకుంటే ఉద్యోగం చెయ్యి. కాని బ్రతకటం కోసం ఉద్యోగం చెయ్యవలసిన అవసరం నీకు ఉండకూడదని నా కోరిక."

"ఐదు సంవత్సరాల నాడు మనం ఇద్దరం ఐదు శతాబ్దాల చిన్నవాళ్ళం. ఆనాడు మనలో మమకారాల కంటే ఆశయాలకీ, ఆవేశాలకీ ఎక్కువ ప్రాధాన్యం కనిపించింది. అందుకనే ఇద్దరం మనలోనున్న అహాన్ని చంపుకోలేక నానా అగచాట్లు పడ్డాం. కాలం నాకు చక్కటి గుణపాఠం చెప్పింది. అర్థం లేని ఆశయాలు, ఆవేశాల కంటే మనిషికి మనిషికీ మధ్య ఉండే ప్రేమ ఎక్కువ అని గ్రహించాను. నీమీద నాకు ఎటువంటి కోపం లేదు. గుడ్‌నైట్" అంటే బయల్దేరాడు.

శాంతి ఏం మాట్లాడకుండా అలాగే నిలబడిపోయింది. రఘు చావిడిదాటి వసారాలోకి వచ్చి మెట్లు దిగుతూ ఒక్కసారి వెనక్కి తిరిగి చూసాడు. ఆ క్రీనీడలో అతని ముఖం ఎంత జాలిగా ఉంది. కాలం అతన్ని ఎంత కఠినంగా శిక్షించింది. ముప్పైఏళ్ళు నిండకుండానే రఘు ముసలివాడయ్యాడే. కష్టసుఖాలలో, ధనదారిద్ర్యాలలో అతని నీడ వదలనని అగ్నిసాక్షిగా ప్రమాణంచేసి కూడా తను చేసిన పనేమిటి? తన స్వార్థం కోసం అతన్ని నాశనం చేసింది.

రఘు వరండా దాటి బయట గేటు దగ్గరకు వెళ్ళి తలుపు తీస్తున్నాడు. శాంతి ఒక్కసారిగా "ఏమండీ" అని పిలిచింది. రఘు వెనక్కి తిరిగి చూసాడు. ఒక్క అంగలో అతని దగ్గరకు వెళ్ళి "ఈ పాపిష్టి దాన్ని క్షమించండి" అని అంది.

రఘు ఏం మాట్లాడలేదు.

"నన్ను వదిలి వెళ్ళిపోకండి. మీకు ఎనలేని అపకారం చేశాను. నేను చేసిన పొరపాటు వచ్చిననాడే గ్రహించాను. నన్ను క్షమించి మీవెంట తీసుకుని వెళతారని ఆశించాను. కానీ ఐదు సంవత్సరాలు గడిచినా మీ మనస్సు మారలేదు.'

"శాంతీ!"

"మీకోసం నేను ఎంత అలమటించానో ఎట్లా చెప్పను? మీరు వస్తున్నారంటే నా మనస్సు ఎంత సంతోషపడింది. వచ్చారు. పరాయివారిలాగా పలకరించి వెళ్ళిపోతారా? ఇప్పటికైనా నన్ను క్షమించరా?"

"నా దగ్గర నువ్వు సుఖపడలేవు."

"అలా అనకండి. ఆనాడు స్వార్థంతో, అహంభావంతో నా కళ్ళు మూసుకు పోయాయి. ఈనాడు అన్నీ గ్రహించాను. ఈ మద్రాసు, ఈ ఉద్యోగం కంటే మీరే ఎక్కువని తెలుసుకున్నాను. మీకు నేను తగననేగా మీరు నన్ను యిలా త్రోసిపుచ్చి వెళ్ళిపోతున్నారు."

"లేదు శాంతీ."

"నన్ను క్షమించండి. మనం యిద్దరం కలిసివుందాం. గడిచినదంతా మర్చిపోదాం."

రఘు ఏం మాట్లాడలేదు.

"ఏమండీ మాట్లాడరేమండీ" అని శాంతి అడిగింది.

రఘు సమాధానం చెప్పలేదు. వెక్కి వెక్కి ఏడుస్తూ అక్కడే కూలబడింది. శాంతి వంక రఘు ఒక్కక్షణం చూసాడు. ముఖం ఎత్తి ఆమె అతని వంక చూసింది. "నిన్ను వదిలి వెళ్ళను."

శాంతి ముఖంలో కన్నీటితోటే చిరునవ్వు తొంగిచూచింది. దూరంగా లౌడు స్పీకర్లో లతామంగేష్కర్ గొంతుక "ఓ సజనా బరకా బహార్ ఆయీ" అని పాడుతోంది.

కలిసిన యీ పాతజంట యింటికి మళ్ళింది.

కథా నిల...
5683
శ్రీకాకుళం